ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 10 డిసెంబరు 2025



మన సాగర్‌కి.. 69 వసంతాలు

బీడు భూముల్లో బంగారు పంటలు పండిస్తూ.. లక్షల ప్రజలతో పాటు జంతుజాల గొంతు తడుపుతూ.. కృష్ణమ్మ పరవళ్లను కట్టడి చేస్తూ చేపట్టిన నాగార్జున సాగర్ జలాశయ నిర్మాణం బుధవారంతో 69 వసంతాలు పూర్తి చేసుకుంది. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1955 డిసెంబరు 10న డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 8



కోలాహలంగా.. యువజనోత్సవం

● ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు 6



షిర్డీ రెగ్యులర్ వీక్లీ ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు కూత 8

తెలంగాణ టూ ఆంధ్రప్రదేశ్

- బయో ఉత్పత్తుల అక్రమ రవాణా
- నరసరావుపేట కేంద్రంగా అన్ని ప్రాంతాలకు సరఫరా
- రూ. 12.28 లక్షల నిల్వలు పట్టుకున్న విజిలెన్స్

6

చోర్ గ్యాంగ్ లీడర్ తండ్రి ఏఎస్ఐ బదిలీ

- ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి కేసులో కదలిక 8

హోరాహోరీగా.. ఎడ్ల పోటీలు 6

కొనుగోళ్లు కొంతే

బహిరంగ మార్కెట్‌కు తరలిపోతోన్న ధాన్యం

రైతు సేవా కేంద్రాల్లో సేకరణలో స్తబ్ధత

- అధికారుల ఉదాసీనతతో తీసికట్టుగా మద్దతు ధర
- మిల్లర్లతో సిబ్బంది లాలూచి.. పట్టించుకోని అధికారులు

మద్దతు ధరకు ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం.. దళారుల మాటలు నమ్మి అన్న దాతలు మోసపోవద్దు.. అధి కారులు పూర్తిగా సహకరిస్తారు.. రవాణా నుంచి ఎక్కడా ఎలాంటి ఇబ్బంది ఉండదు.. అని మంత్రుల నుంచి కలెక్టర్ వరకు ప్రకటిస్తు న్నారు. కానీ అన్నదాతలకు ఏ స్థాయి లోనూ మద్దతు ఉండటం లేదు.. ధర దక్కడంలేదు. అధికా రుల ఉదాసీనతతో బహిరంగ మార్కెట్‌కే అత్యధికంగా ధాన్యం తరలి పోయిందని సివిల్ సప్లయిస్ లెక్కలు తెలియజేస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు సమీపంలో కూడా ఇప్పటి వరకు మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ జరగ లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయానికి అన్నదాతలు ఎందుకు ముందుకు రావడం లేదు.. లోటుపాట్లు ఏమిటి అనే విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ధాన్యం సేకరణ అంకంలో కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు చేశారే కానీ బహిరంగ మార్కెట్ అంశం తమదే కాదన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు లక్షన్నర మెట్రిక్ టన్నుల ధాన్యం బహిరంగ మార్కెట్‌కు తరలినట్లు అంచనాలు ఉన్నాయి.



బాపట్ల: గూడవల్లి సమీపంలోని రహదారిపై ఆరబోసిన ధాన్యం

సాంకేతిక సమస్యలతో జాప్యం..

రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి యాప్ సర్వర్‌కు సాంకేతిక సమస్యతో కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. స్లాట్ బుకింగ్ సకాలంలో ఓపెన్ కావడంలేదు. దీంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అవకాశంగా దళారులు ధరను తగ్గించి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రూ.1300 మాత్రమే ఇస్తామన్నా గత్యంతరం లేక అటు ఆర్‌ఎస్‌కేల్లో అమ్మకానికి అవకాశం లేక ఇటు నిల్వ చేసుకునే గోదాములు లేక రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తుంది.

పిడుగురాళ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించినా కొనుగోళ్ల విషయంలో వ్యవసాయశాఖ తీరు నత్తే నయమన్నట్టుగా సాగుతోంది. లక్షల టన్నుల్లో ధాన్యం పొలాల్లో నుంచి వస్తుంది. కేవలం కొనుగోలు కేంద్రాలపై దృష్టి కాకుండా బయట కొనుగోళ్లను కూడా రెగ్యులేట్ చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు రచించుకోవాలి. అయితే ఆర్భాటపు ప్రకటనలకే పాలకులు పరిమితమవుతున్నారన్న అభిప్రాయం ఇప్పటికే రైతుల్లో వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారం నిర్వర్తించాల్సిన విధుల్లో కూడా ఆయా విభాగాల ఉదాసీనతే రైతులకు శాపంగా మారుతోంది. ఎక్కడికక్కడ రైతు సేవా కేంద్రాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్లు అర కొరగానే జరుగుతున్నా అధికారులకు పట్టడం లేదు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ఇప్పటికే దాదాపు లక్షన్నర టన్నుల ధాన్యం బహిరంగ మార్కెట్‌కు తరలిపోయిందంటే (మిగతా 8వ పేజీలో)



పిడుగురాళ్లలో లారీకి ధాన్యం ఎగుమతి చేస్తున్న కూలీలు

లక్ష్యాలకు దూరం

బాపట్ల జిల్లాలో మొత్తం దిగుబడి 6.80 లక్షల టన్నులు అంచనా కాగా లక్ష్యం రెండు లక్షల టన్నులు. అయితే ఇందులో ఇప్పటి వరకు 21,000 టన్నుల ధాన్యాన్ని మాత్రమే మద్దతు ధరకు సివిల్ సప్లయిస్ విభాగం కొనుగోలు చేసింది. గుంటూరు జిల్లాలో దిగుబడి 4.50 లక్షల టన్నులు కాగా సేకరణ లక్ష్యం 50,000 టన్నులు. పల్నాడు జిల్లాలో దిగుబడి 4.30 లక్షల టన్నులు ఉండగా సేకరణ లక్ష్యం 40 వేల టన్నులు. నిర్దేశించిన లక్ష్యం మేర ఏ జిల్లాలోనూ కొనుగోళ్లు జరగలేదని సివిల్ సప్లయిస్ గణాంకాలు తెలియజేస్తున్నాయి.

విద్యాశాఖాధికారుల బదిలీ

గుంటూరు, పల్నాడు, బాపట్ల డీఈవోలకు స్థానచలనం



ఎస్ కే సలీం బాషా, డీఈఓ గుంటూరు



పీవీజే రామారావు, డీఈఓ, పల్నాడు



సింగ్ శ్రీనివాస్, డీఈఓ బాపట్ల

నరసరావుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల ప్రణాళికతో సిద్ధమవగా ఎవరూ ఊహించనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. వంద రోజుల ప్రణాళిక అమలులో అధికారులు నిమగ్నమై ఉండగా డీఈవోల బదిలీ ఉపాధ్యాయులను విస్మయానికి గురిచేసింది. కాగా గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి సీవీ రేణుక, పల్నాడు డీఈవో ఎల్ చంద్రకళ, బాపట్ల డీఈవో పురుషోత్తంను బదిలీ చేస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు డీఈవోను ప్రకాశం జిల్లాకు, పల్నాడు డీఈవోను కృష్ణా జిల్లాకు బదిలీ చేయగా బాపట్ల డీఈవో పురుషోత్తంకు ఎటువంటి బాధ్యతలు అప్పగించలేదు. కాగా జిల్లా పాఠశాల విద్య ఆఫీసర్(డీఎస్‌డీవో) అనే పేరుతో జిల్లాల్లో అధికారులకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. గుంటూరు డీఎస్‌డీవోగా అంబేద్కర్ కోనసీమ జిల్లా డీఈవో ఎస్కే సలీంభాషాను, పల్నాడు డీఎస్‌డీవో కృష్ణాజిల్లా డీఈవో పీవీజే రామారావు నియమితులయ్యారు. బాపట్ల డీఎస్‌డీవోగా పాఠశాల విద్యలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న సింగ్ శ్రీనివాస్‌ను నియమించారు. నూతనంగా నియమతులైన డీఎస్‌డీ వోలు రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

బదిలీలపై విస్మయం

ప్రభుత్వ ఆదేశాలతో వందరోజుల ప్రణాళిక అమలు కోసం ఇప్పటికే డీఈవోలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి క్షేత్రస్థాయిలో పరిస్థితుల్ని అంచనా వేస్తూ పర్యటనలు చేస్తున్నారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా డీఈవోల బదిలీలు ఏమిటని ఇటు ఉపాధ్యాయులు, అటు ఉపాధ్యాయ సంఘాల నేతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కొత్త డీఎస్‌డీవోలుగా నియమితులైన వారు బాధ్యతలు స్వీకరించిన తర్వాత పరిస్థితుల్ని అవగాహన చేసుకుని తిరిగి సాధారణ పరిస్థితులు నెలకునేందుకు నెల రోజులకు పైగా సమయం పడుతుందని, ఇది పది పరీక్షలపై ప్రభావం పడే అవకాశం ఉందని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టెట్ పక్కాగా నిర్వహించాలి

- ఐదు కేంద్రాల్లో నేటి నుంచి ప్రారంభం
- పరీక్షల నిర్వహణపై సమీక్షలో డీఆర్వో మురళి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు కేంద్రాల్లో బుధవారం నుంచి 21 వరకు జరిగే టెట్ పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డీఆర్వో మురళి ఆదేశించారు. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) నిర్వహణపై నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మంగళ వారం డీఈవో చంద్రకళతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల, ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల బ్లాక్-4, తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యా హ్నం 2 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించాలన్నారు. అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండేలా ఆదే శాలు జారీ చేయాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పా టు చేయాలన్నారు. స్క్వాడ్ బృందాలు కేంద్రాలను తరచూ తనిఖీ చేసి పరీక్షలు సజావుగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. పరీక్షా సమయంలో అంతరాయం లేకుండా అంతర్జాలం, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న డీఆర్వో ఈ మురళి, అధికారులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అభివృద్ధి

- సాస్కితో గ్రామీణ రోడ్ల అనుసంధానానికి చర్యలు
- కొత్తపాలెం వద్ద బ్రిడ్జి పనుల పరిశీలినలో చీఫ్‌విప్ జీవీ

వినుకొండటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ అభివృద్ధి అని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని కొత్తపాలెం సమీపంలో గుండ్లకమ్మపై రూ.15.83 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను మంగళవారం ఆయన పరిశీలిం చారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణలు తప్పనిసరి అని త్వరితగతిన పనులు పూర్తి చేసి బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డీఈ గంగయ్యను ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జీవీ మాట్లాడుతూ గ్రామాల ఆర్థిక స్థితిగతులు పెరగాలంటే రోడ్లు తప్పనిసరి అన్నారు. అందుగులపాడు నుంచి పాతనాగిరెడ్డిపల్లి మీదగా కురిచేడు వెళ్లే రోడ్డును ప్రధాన రహదారికి అనుసంధానం చేస్తామన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో గతంలో రూ.4500 కోట్లతో రోడ్లు నిర్మించామని, ప్రస్తుతం సాస్కి పథకం ద్వారా కేంద్రం చొరవతో గ్రామాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల కిలోమీటర్ల మేర రోడ్లు గుంతలు ఏర్పడగా ఎన్‌డీఏ ప్రభుత్వం 18 నెలల వ్యవధిలో 23వేల కిలోమీటర్ల మేర వాటిని పూడ్చిందన్నారు. కార్యక్రమంలో టీ డీపీ మండల మాజీ అధ్యక్షులు మాదినేని ఆంజనేయులు, వంకాయలపాటి పేరయ్య, డీసీ కొండలు, శ్రీను, పేరయ్య, ఎం.సుబ్బారావు ఉన్నారు.



గుండ్లకమ్మపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న చీఫ్‌విప్ జీవీ

ఇద్దరు సూపర్‌వైజర్లకు మెమోలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫుడ్ కమిషన్ సభ్యుడి తనిఖీ


నరసరావుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మిరెడ్డి తనిఖీ చేశారు. పలు లోపాలను గుర్తించిన ఆయన ఇద్దరు సూపర్‌వైజర్లకు, ఇద్దరు కార్యకర్తలకు మెమోలు జారీ చేశారు.గురజాల నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురం - 5 అంగన్‌వాడీ కేంద్ర పర్యవేక్షణ లోపంతో గురజాల సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారికి, చర్లగుడిపాడు - 1 కేంద్రంలో ప్రీస్కూల్ హాజరు వేయకపోవడంపై, చర్లగుడిపాడు - 4 అంగన్‌వాడీ కేంద్రంలో 160 గుడ్లు ఎందుకు నిల్వ ఉన్నాయని పులిపాడు సెక్టారు సూపర్‌వైజర్ శ్రీలక్ష్మిలకు మెమో జారీ చేశారు. చర్లగుడిపాడు, జంగమహేశ్వరపురం అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు రమాదేవి, పేరం విజయభారతిలకు మెమో జారీ చేశారు. మూడు రోజుల్లోగా సంజాయిషీ తెలపాలని మెమోలో స్పష్టం చేశారు.




కస్తూర్బా పాఠశాలలో భోజనం రుచి చూస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి

కరకట్ట.. ప్రమాదకరం

గోతులు, పగుళ్లతో అధ్వానంగా రోడ్డు



● కొల్లూరు దగ్గర ఇరువైపులా కుంగిపోయిన కరకట్ట



● అత్తలూరివారిపాలెం-గొడవర్రు మధ్య ఏర్పడిన గుంతలు

- ఇసుక వాహనాలతో కుంగిపోయిన వైనం
- రోడ్డు ఆధునికీకరణ.. ప్రతిపాదనలకే పరిమితం

తెనాలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ప్రవాహాన్ని కట్టడి చేస్తూ.. ప్రజలకు ప్రధాన రవాణా మార్గంగా అందుబాటులో ఉన్న కరకట్ట ప్రమాదకరంగా మారింది. మోకాలి లోతున గోతులు.. కుంగిన రోడ్డుతో కరకట్టపై ప్రయాణం ఓ సాహసమేనని వాహన చోదకులు చెప్తున్నారు. రాకపోకల్లో ఏ మాత్రం ఆదమరిచినా 15 నుంచి 20 అడుగుల లోయలోకి వెళ్లిపోవాల్సిందేనని వాపోతున్నారు. 68 కిలోమీటర్ల పొడవున్న ఈ రోడ్డుపై రోజుకు కనీసం పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయంటే రోడ్డుపై ఉన్న గుంతలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. దశాబ్దం క్రితం ప్రకాశం బ్యారేజి నుంచి లంకెవానిదిబ్బ వరకు కరకట్టను ఆధునికీకరించారు. ఆ తర్వాత నుంచి దీనిని పట్టించుకున్నవారు లేరు. ఆ తర్వాత ఇసుక రవాణాను కరకట్టపైనే అనుమతించటంతో పూర్తిగా దెబ్బతినిపోయింది. కొన్నిచోట్లయితే మోకాళ్లలోతులో గుంతలుపడిపోతే, చాలాచోట్ల కరకట్ట నదివైపు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. తాడేపల్లి దగ్గర మణిపాల్ ఆసుపత్రి ఎదురు నుంచి కుడి కరకట్ట రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. కిలోమీటరు (మిగతా 8వ పేజీలో)

డీసీసీబీ మాజీ చైర్మన్‌పై కేసు

రాము, మాజీ సీఈవో కృష్ణవేణిపైనా..

గత పాలకవర్గ సభ్యులపైనా క్రిమినల్ చర్యలు

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నల్లపాడు బ్రాంచ్‌లో బోగస్ రుణాల వ్యవహారంలో బోక్తలపై కేసులు నమోదయ్యాయి. వైసీపీ హయాంలో బ్యాంకు చైర్మన్‌గా వ్యవహరించిన రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాల్‌పురం రాము), మాజీ సీఈవో టీ కృష్ణవేణి, నల్లపాడు బ్రాంచ్ మాజీ మేనేజర్ దేవరకొండ అరుణకుమారితో పాటు పాలకవర్గ సభ్యులు 11 మందిపై నల్లపాడు పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. బోగస్ రుణాల పేరుతో దోపిడీపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో ఒక్క నల్లపాడు బ్రాంచ్‌లో రూ.22 కోట్లపైనే అక్రమాలు జరిగినట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే మాజీ సీఈవోలు కృష్ణవేణి, అజయ్‌కిశోర్‌లను సస్పెండ్ చేశారు. కాగా మాజీ చైర్మన్, మాజీ సీఈవో, బ్రాంచ్ మేనేజర్‌లతో పాటు అప్రైజర్ యర్రంశెట్టి ఈశ్వర్‌ప్రసాద్, పాలకవర్గ సభ్యులు నల్లపాటి రామయ్య, కోట హరిబాబు, వట్టికొండ కోటేశ్వరమ్మ, పీట వెంకటేశ్వర్లు, డీ గోవిందనాయక్, వెలిశెల ఏడుకొండలు, కూనిశెట్టి శివనవీన్(ప్రొఫెషనల్ డైరక్టర్)లపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులు నమోదు సహకార శాఖలో కలకలం రేకెత్తించింది. మంగళగిరి, కురగల్లులో పీఏసీఎస్‌లలో కూడా రైతులు సొమ్ము స్వాహా చేయడం కూడా ఆ శాఖలో చర్చనీయాంశంగా మారింది.



ఆటో బోల్తాపడి మహిళ మృతి


శాయమ్మ (ఫైల్)

వినుకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి మహి ళ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘ టన మండలంలోని నీలగంగవరం గ్రామ సమీపంలో మంగళ వారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలను పరిశీ లిస్తే గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎనుముల శాయమ్మ, వేమవరపు ఎస్తేరమ్మ, ఎనుమల పెద్ద జాన్, వేమవరపు సాలమ్మలు ఆటోలో మండలంలోని శివాపురం గ్రామంలోని చర్చి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని తిరిగి స్వగ్రామానికి ప్రయాణిస్తుండగా గ్రామానికి కిలోమీటరు దూరంలోని రోడ్డు మలుపు వద్ద ఆటో బోల్తాపడి ఎనుమల శాయమ్మ (50) మృతి చెందగా, వేమవ రపు ఎస్తేరమ్మ, ఎనుమల పెద్ద జాన్, వేమవరపు సాలమ్మలకు గాయాలయ్యాయి. బంధువులు క్షతగాత్రులను వినుకొండ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పెద్ద జాన్ పరిస్థితి ఆందోళ నకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. శాయమ్మ మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలిం చారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రిస్మస్‌కు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండగ సెలవుల సందర్భంగా గుంటూరు మీదగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07196 చర్లపల్లి - కాకి నాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 24, 30 తేదీల్లో రాత్రి 7.30 గంటలకు బయలుదేరి పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9కు కాకినాడ టౌన్‌కు చేరుకుంటుంది. నంబరు. 07195 కాకినాడటౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 28, 31 తేదీల్లో రాత్రి 7.50కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు ఉదయం 8.30కి చర్లపల్లి చేరుకుంటుంది. ఈ రైళ్లలో ఫస్ట్, సెకండ్, థర్డ్ ఏసీ, స్లీపర్, జనరల్ భోగీలుంటాయని సీపీఆర్‌వో తెలిపారు.

చైతన్య వంతులుగా ఓటర్లు

లోక్ సభలో ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు



గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో మంగళవారం జరిగిన చర్చలో టీడీపీ ఫ్లోర్ లీడర్, నర సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రసంగించారు. గడిచిన కాలాన్ని పరిశీలిస్తే భారతీయ ఓటర్లు ఎంతో చైతన్యవంతంగా, విజ్ఞా నంతో ఓటు హక్కును వినియోగించుకుంటున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఎన్నోసార్లు ఎన్నికలు జరిగాయని, ఓటర్లలోని ఆలోచనలతోనే గడిచిన కాలంలో ఎన్నో ప్రభుత్వాలు మారాయని, ఇది వారిలోని పరిపక్వతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఓటర్ల విజ్ఞానికి ఒక ఉదాహరణగా 1983లో తెలుగుదేశం పార్టీ అపూర్వ విజయం సాధిం చిందని తెలియజేశారు. మార్చి 1982లో తెలుగుదేశం పార్టీ ఏర్పడిం దని, ఆ సమయంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్నంతగా వార్తాపత్రి కలు, సోషల్ మీడియా, టెలివిజన్ ఛానళ్లు లేవని అన్నారు.

అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 294 నియోజకవర్గాలకు గానూ తెలుగుదేశం 200కి పైగా నియోజక వర్గాలలో విజయం సాధించిందని, 42 లోక్‌సభ స్థానాలకు గాను 30 స్థానాలను తొమ్మిది నెలల కాలంలోనే గెలుచుకుందని గుర్తు చేశారు. కొత్తగా పార్టీ ఏర్పడి, అధికారిక చిహ్నం కూడా లేని సమ యంలో కూడా మొదటి ఎన్నికల్లో ఇంత విజయం సాధించటాన్ని.. భారత ఓటర్ల తెలివితేటలు, జ్ఞానాన్ని ఎత్తి చూపిస్తుందని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పునరుద్ఘాటించారు. ప్రతిపక్ష కాంగ్రెస్ వారు ఓట్ల చోరీ, ఈవీఎంలపై తరచూ మాట్లాడుతున్నా రని, కర్ణాటక, తెలంగాణలో విజయం సాధించినప్పుడు వారు మాట్లాడలేద న్నారు. హర్యానాలో, ఇటీవల బీహార్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించిన ప్పుడు మాత్రమే వారు ఆరోపిస్తున్నా రన్నారు. ప్రజలు ఎంతో చైతన్యవంతంగా ఓటేస్తేనే విజయం సాధిస్తారనే విషయా న్ని గమనించాలని తెలిపారు. గడిచిన కాలాన్ని పరిశీలిస్తే ఎన్నికల సమయంలో జరిగే నేరాలపై చర్యలు తక్కువగా ఉన్నాయని వీటిపై చట్టబద్ధంగా ఉన్న చర్యలను పటిష్టం చేయాలని సూచించారు. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్‌లోని పార్ట్ 9(ఏ) ఆర్టికల్ 243ను సవరించా లని, ప్రజలకు భరోసా ఇస్తూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగిం చుకునేందుకు గాను రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను బలోపేతం చేయడా నికి అన్ని పార్టీలు కలిసి రావాలని ఆయన అభ్యర్థించారు.

హోరాహోరీగా.. ఎడ్ల పోటీలు

విజేతగా పల్నాడు జిల్లా జత


పందెపు బండను లాగుతున్న ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గురజాల శ్రీపాతపా టేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీల్లో భాగంగా మంగళవారం నాలుగుపళ్ల విభాగం లో పోటీలు జరిగాయి. దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన ఎ డ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 3909 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచింది. తెలంగాణ రాష్ట్ర మేళ్లచెరువుకు చెందిన కొ ప్పుల గోవర్ధన్‌రెడ్డి, ప్రవలీష్‌రెడ్డి ఎడ్లజత 3882 అడుగులతో రెండోస్థా నం, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం బసినేపల్లికి చెందిన యండ్లకండ్ల శ్రీనివాసులు ఎడ్లజత 3756 అడుగులతో మూడోస్థానం, బాపట్ల జిల్లా కొల్లూరు మండలం అనంతవరంకు చెందిన బుసి లీ లాసాయిమనోహర్, గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఆలా రాజేష్ యాదవ్ సంయుక్త ఎడ్లజత 3750 అడుగులు, గుంటూరు జి ల్లా ప్రత్తిపాడు మండలం పమిడి అంజయ్య చౌదరి ఎడ్లజత 3750 అడుగులతో మూడు, నాలుగు స్థానాలను సమానంగా పంచుకున్నా యి. అలాగే పల్నాడు జిల్లా క్రోసూరు మండలం బయ్యవరంకు చెం దిన కడియం మణికంఠ ఎడ్లజత 3718 అడుగులతో ఐదోస్థానం ద క్కించుకుంది. పోటీల అనంతరం విజేత ఎడ్లజత యజమానులకు ని ర్వాహకులు బహుమతులు అందించారు. కాగా మంగళవారంతో పో టీలు ముగిశాయి. ఈ సందర్భంగా కమిటి సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సహకారంతో పోటీలు విజయ వంతంగా ముగిశాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు న ల్ల లక్ష్మయ్య, తన్నేటి బుచ్చిబాబు, నెల్లూరి మల్లయ్య, పోటు నాగేశ్వర రావు, విశ్వనాథం, నవులూరి శ్రీరామ్మూర్తి, చలవాది శ్రీను, షేక్ నాగు ల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ రిజర్వేషన్ల సాధనకు పార్లమెంటు ముట్టడి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు


చలో ఢిల్లీ గోడప్రతులను ఆవిష్కరిస్తున్న కేసన శంకరరావు, నేతలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, చ ట్టసభల్లో ఓబీసీలకు జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు సాధిం చుకునేందుకు చలో ఢిల్లీకి పిలుపునిస్తున్నట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. మంగళగిరిలోని సం ఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం హలో బీసీ-చలో ఢిల్లీ తాలూకా గోడప్రతులను బీసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఓబీసీలకు రిజర్వేషన్లు కేటాయించే బిల్లును పాలక, ప్రతిపక్ష జాతీయ కూటములు ప్రస్తుత శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా చ ట్టం చేయాలని డిమాండ్ చేశారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు పరిమితి అసంబద్ధమైనదని, దానిని అధిగమించేందుకు పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన జంతర్ మంతర్ వద్ద మహాధర్నా తోపాటు పార్లమెంటు ముట్టడి కార్యక్రమం, 16న ఓబీసీలకు జనాభా దామాషా మేరకు రాజకీయ రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో చట్ట సవరణ చేసి ఓబీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని కోరుతూ జాతీయ స్థాయిలోని ప్రముఖులకు విజ్ఞాపన పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, నేతలు శివరాం బాబాజీ, కోలా అశోక్, మేకా వెంకటేశ్వరరావు, వాకా వెంకటేశ్వరరావు, జంజనం వరప్రసాద్, శివాజీ, ధనుంజయరావు, అడపా శ్రీనివాసరావు, సైదా తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి జాతీయస్థాయి యోగా పోటీలు

ఏర్పాట్లను పరిశీలించిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27, 28, 29 తేదీలలో బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలోని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రయోగ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి యోగాసన పోటీలు జరగనున్నాయి. దానికి సంబంధిం చిన ఏర్పాట్లను మంగళవారం బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర


యోగాసన పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

వర్మ పరిశీలించారు. జిల్లెళ్ళమూడి గ్రామంలో జాతీయ స్థాయి యోగాసన పోటీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నా మని పేర్కొన్నారు. ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రప్ర భుత్వం తరుపున పలువురు మంత్రులు అతిధులను ఆహ్వానిం చి ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించటం ద్వారా యోగా విశిష్టతను మరోమారు సమాజానికి చాటిచెప్పే ప్రయ త్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రయోగా అ సోసియేషన్ అధ్యక్షులు కళ్ళం హరినాథరెడ్డి, కార్యదర్శి అల్లాడి రవికుమార్, వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళికృ ష్ణ, ప్రముఖ ఆడిటర్ చాపలసుబ్రహ్మణ్యం, శీలం శ్రీనివాసరావు, రెడ్డి నాగరాజు, డాక్టర్ సిద్ధార్థ, వీరభద్రరావు, పిన్నిబోయిన శ్రీమ న్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టు వద్ద మాక్ డ్రిల్



అచ్చంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టు వద్ద మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ఆక్టోపస్ అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆక్టోపస్ డీఎస్పీ విశ్వనాథం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పులిచింతల ప్రాజెక్టుకు ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే ఎలా ఎదుర్కోవాలనే దానిపై అధికారులు సిబ్బందికి వివరించారు. అడవిలో నుంచి, నీటిలో నుంచి, ఆకాశం నుంచి అవాంఛనీయ సంఘట నలు ఎదురైతే ఎలా ఎదుర్కోవాలనే దానిపై తెలిపారు. కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ విశ్వనాథంతో పాటు డీఎస్పీ మధు, పల్నాడు జిల్లా ఏఆర్ డీఎస్పీ జీఎం గంగిరెడ్డితో పాటు ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అచ్చంపేటలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు ఆక్టోపస్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 43.30 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలిపారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా నాలుగు వేల క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మొత్తం 4,400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

రూ.165 కోట్లతో అభివృద్ధి పనులు

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా



(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

నిధుల కేటాయింపులో జడ్పీటీసీలకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నా. నిధులు కేటాయించే విష యంలో ఉమ్మడి జిల్లా లోని శాసనసభ్యులు పంపే ప్రతిపాదనలు పరిశీలించి ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత నాపై ఉంది. జడ్పీటీసీలు నిధులు అడిగినా.. ఎమ్మెల్యేలు నిధులు అడిగినా ఆ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసమే కదా?! అని, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా ప్రశ్నించారు. గుంటూరు జిల్లా పరిషత్‌లోని క్యాంపు కార్యాలయంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా మంగళవారం మాట్లాడుతూ గడచిన నాలుగేళ్ళలో రూ.165.91 కోట్లతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. జిల్లా పరిషత్‌కు మూల స్తంభం వంటి జడ్పీటీసీల ప్రతిపాదనలకు ఎప్పుడూ పెద్ద పీట వేశామని చెప్పారు. కేవలం నిధులు కేటాయింపు విషయంలో మాత్రమే కాకుండా ప్రోటోకాల్ వ్యవహారంలో కూడా చాలా మంది జడ్పీటీసీలు గతంలో అనేక ఫిర్యాదులు చేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్యలు పరిష్కరించానని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖ నుంచి జిల్లా పరిషత్‌కు రావాల్సిన సర్‌చార్జి విడుదల కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నట్టు క్రిస్టీనా తెలిపారు. ఆ విషయం తెలుసు కోకుండా కొందరు ఆరోపణలు చేయటం హాస్యాస్పద మన్నారు. సర్ చార్జి విడుదల విషయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను రెండుసార్లు కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. జిల్లా పరిషత్ పరిధిలో ఏ పోస్టు ఖాళీ అయిన వెంటనే ఆ పోస్టుకు ప్రమోషన్ కల్పించేందుకు నిరంతరం ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది విద్యా దీవెన స్టడీ మెటీరియల్ వీలైనంత త్వరలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పదవతరగతి విద్యార్థులకు అందజేస్తామని, రూ. 61 లక్షలు వ్యయంతో సుమారు 34,747 మంది విద్యార్థులకు ఈ మెటీరియల్ అందజేస్తున్నామని తెలిపారు.

తెలంగాణ టూ ఆంధ్రప్రదేశ్

● బయో ఉత్పత్తుల అక్రమ రవాణా ● నరసరావుపేట కేంద్రంగా అన్ని ప్రాంతాలకు సరఫరా ● రూ. 12.28 లక్షల నిల్వలు పట్టుకున్న విజిలెన్స్


నరసరావుపేట లోని ట్రాన్స్‌పోర్ట్, పార్సిల్ కార్యాలయాలపై దాడులు నిర్వహిస్తున్న విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, ఏటీ సీహెచ్ ఆదినారాయణ

గుంటూరు సిటీ, నరసరావుపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గుం టూరు నుంచి నకిలీ మందులను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేసే బయోల మాఫియా ఇప్పుడు రూటు మార్చింది. పల్నాడు జిల్లా కేంద్రం అయిన నరసరావుపేట నుంచి నకిలీ బయో మందులు, అందుకు సంబంధించిన ఉత్ప త్తులను రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేస్తున్నట్టు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచార ణలో తేలింది. తెలంగాణ నుంచి ఊరు, పేరు లేని బయోలను నరసరావుపేట తెప్పించి అక్కడ నుంచి వివిధ జిల్లాలకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గత మూడు రోజులుగా నరసరావుపేటలోని ట్రాన్స్‌పోర్ట్, పార్సిల్ కార్యాలయాలపై నిఘా వేసి లక్షలాది రూపాయలు విలువ చేసే బయో ఉత్పత్తులను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొని, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులకు అందజేశారు. ఈ దాడులలో 188.8 లీటర్ల బయో ఉత్పత్తుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ. 12.28 లక్షలు ఉంటుందని అధికారులు తేల్చారు. ఈ దాడులలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, విజిలెన్స్ ఏఓ సీహెచ్ ఆదినారాయణ, స్థానిక ఏఓ శాంతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి దుర్మరణం

బాపట్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో ద్విచక్రవాహనంపై వెళుతున్న యువకుడిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ ఎస్సై చంద్రావతి తెలిపిన వివరాలు ప్రకారం ఉప్పర పాలెంకు చెందిన ఉసిరికాయల శివరాం (23) చీలురోడ్డుసెంటర్‌లోని బజ్జీల దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం దుకాణంలోకి ఆయిల్ తెచ్చేందుకు వెళ్ళి వస్తుండగా గుంటూరు వైపు వెళ్ళే లారీ ఢీకొనడంతో యువ కుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం మంగళవారం నాటికి 576.80 అడుగులు ఉంది. ఇది 273.81 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8367 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 20,167 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 20,167 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

51,571 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 54,735 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,571 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,489 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర	వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000	334	10500	16800
నెంబరు. 5	11500	15500	నెంబరు. 5	11000	15300
273	----	----	273	----	----
341	10500	16500	341	11000	16500
4884	----	----	4884	----	----
సూపర్ 10	----	----			
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15700	తేజ	11000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి 355	11000	16900
బ్యాడిగి	10500	16700	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	11000	16300	తాలుకాయలు	5000	7600
అర్మూరు	10500	13000			

38 బృందాలతో విద్యుత్ శాఖ తనిఖీలు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం మండలపరిధిలో 38బృందాలుగా 3,195 సర్వీసులను తనిఖీ చేసి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారికి అపరాధ రుసుంగా రూ. 4,46,500 విధించినట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. తనిఖీలలో విద్యుత్ శాఖ విజిలెన్స్ సూపరిండెంట్ ఇంజనీరు కేవీన్ మూర్తి, డీఈ ఎస్‌ఏ కరీం, ఏడీఈలు రవికుమార్, మల్లికార్జున, ప్రసాద్, శ్రీనివాసరావు, సీఆర్‌డీఏ ఎస్‌ఈ ఎం శ్రీనివాసరావు, డీఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఏడీఈలు కేవీ కోటేశ్వరరావు పాల్గొన్నట్లు అమరావతి ఏఈ రవికిరణ్ తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. ఈ సమావేశంలో మండలపరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

డిప్యూటీ ఎంపీడీవోగా రాజబాబు

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అమరావతి డిప్యూటీ ఎంపీడీవోగా టి.రాజాబాబు బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

● కారంపూడి: మండల డిప్యూటి ఎంపీడీవోగా నరిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పెదకూరపాడులో ఈవోగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై కారంపూడికి వచ్చారు.

జీఎస్‌డబ్ల్యూ అధికారిగా శ్యాంప్రసాద్

రాజుపాలెం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ వార్డు సచివాలయాల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన మండల జీఎస్‌డబ్ల్యూ అధికారిగా నియమితులైన సోమాబత్తుల శ్యాంప్రసాద్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

ఏపీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

గురజాలటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడిగా అల్లం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నరసరావుపేటలో మంగళవారం నిర్వహించిన ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఎన్నికల్లో ఈయన ఎన్నిక జరిగింది. శ్రీనివాస్ గురజాల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురజాల శాఖ అధ్యక్షుడు ఉన్నం హనుమంతరావు, అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బిహార్ వాసికి గాయాలు

రెంటచింతల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బిహార్‌కి చెందిన కూలీకి గాయాలైన సంఘటన రెంటచింతలలోని గోలి వాగు వద్ద జరిగింది. ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం రాంపూరి జిల్లాకు చెందిన సంతోష్ చౌదరి రెంటచింతల సమీపంలోని రైస్ మిల్లులో పనిచేస్తున్నాడు. పని ముగించుకుని వస్తున్న సమయంలో గురజాలకు అతివేగంతో వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108లో గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనం ఢీ ఇద్దరికి గాయాలు

రెంటచింతల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మాచర్ల నుంచి గుంటూరువైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్రవాహనంపై బేల్దార్ పనికి వెళ్తున్న వారిని రెంటచింతల ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాచర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి క్రాస్ చేయగానే ఎదురుగా వస్తున్న గుంటూరు వెళ్లే బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో డేగల అనిల్(18) మామిళ్లపల్లి రామకృష్ణ(45)లకు తలకు కాళ్లకు గాయాలయ్యాయి. కాగా తొలుత గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రామకృష్ణను నరసరావుపేట ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ఆర్టీసీ బస్సును పోలీసుస్టేషన్‌కు తరలించారు.

దివ్యాంగులను ఆదరించాలి

● ఎంఈవో రాజకుమారి

బెల్లంకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులను ఆదరించాలని ఎంఈవో రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం బెల్లంకొండ భవిత సెంటర్ నందు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులను ప్రతి ఒక్కరు ఆదరించి వారికి మంచి సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి సదుపాయాలు కావాలన్నా అందజేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో- 2 బాల సుందరరావు, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం తహద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

సత్తెనపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు మంగళవారం కమిషనర్ ఆనంద్ కుమార్‌కు వినతిపత్రం అందించారు.

ఎస్టీయూ జిల్లా మహిళా కన్వీనర్‌గా బేబిరాణి

రెంటచింతల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ పల్నాడు జిల్లా మహిళా కన్వీనర్‌గా బేబిరాణి, జిల్లా కార్యదర్శిగా కె.నాగేశ్వరరావు, ఆడిట్ కమిటీ మెంబర్‌గా బీముడునాయక్ నియమితులయ్యారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన జరుగుతుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని ముస్సాపురం గ్రామంలో ప్రజల వద్దకు ప్రవీణ్ వంద రోజులు వంద గ్రామాల కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నారన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు సమస్యలతో కూడిన వినతి పత్రాలను ఎమ్మెల్యే ప్రవీణ్‌కు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, 75 తాళ్ళూరు సహకార సంఘం ఛైర్‌పర్సన్ ఏటుకూరి రత్నకుమార్, మాజీ అధ్యక్షుడు వట్టికూటి శివరామకృష్ణయ్య, టీడీపీ నాయకులు దాసరి రాంబాబు, గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్, తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, ఎంపీడీవో సాయి లీల, ఘంటా ప్రసాదు, పాటిబండ్ల


ముస్సాపురంలో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బ్రహ్మం, బత్తుల నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చిన మహిళలు

ఎమ్మెల్యే ప్రవీణ్‌కు గ్రామంలోని మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. తీన్‌మార్ వాయిద్యాలతో, డప్పు సప్పుళ్ళతో, బాణ సంచా కాల్పుల మధ్య గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా పలు గృహాలకు వెళ్లి పార్టీ శ్రేణులతో, కార్యకర్తలతో ముచ్చటించారు.

నేడు రాష్ట్ర స్థాయి ఆటలపోటీలకు హాజరు

పెదకూరపాడులోని జీఆర్‌సీఆర్‌కే శ్రీచైతన్య హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు గుత్తా కవితా రాము తెలిపారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని ఆయన వివరించారు.

నేడు అందుకూరులో ప్రజల వద్దకు ప్రవీణ్

క్రోసూరు మండలంలోని అందుకూరులో వంద రోజులు వంద గ్రామాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే ప్రవీణ్ పర్యటించనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్ జాన్ తెలిపారు.

12న గంగిరెడ్డిపాలెం రాక

బెల్లంకొండ(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఈనెల 12వ తేదీన వంద రోజులు వంద గ్రామాల కార్యక్రమంలో మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామానికి రానున్నట్టు కోళ్ళూరు ప్రసన్నాంజనేయ స్వామి వారి ఆలయ కమిటీ ఛైర్మన్ ఆసుల జగన్, టీడీపీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంచాలి

● ఆముదాలవలస ఎమ్మెల్యే రవికుమార్

పిడుగురాళ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక క్రీడలపై విద్యార్థులకు ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు గెలుపొందిన విద్యార్థులకు తగిన బహుమతులు కూడా ఇచ్చారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. మంగళవారం పిడుగురాళ్లలో నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు వెస్ట్‌బెంగాల్‌లో జరిగే బాల బాలికల సీనియర్ జట్లకు, క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే క్రీడలపై విద్యార్థులకు ఆసక్తి పెంచేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం స్కాలర్స్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే రవికుమార్ మొక్కలు నాటారు. అసోసియేషన్, స్కాలర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రవికుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సూర శ్రీనివాసరావు, పి సామంతరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ ఎంవి రమణ, కోశాధికారి ఆవుల జనార్ధనరావు, స్కాలర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ జి శ్రీనివాసరెడ్డి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్‌లు అందజేస్తున్న ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తదితరులు

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు

సత్తెనపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు అన్నారు. పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు మంగళవారం యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. పట్టణంలోని వేద కళాశాలలో కూడా విద్యార్థులకు డ్రగ్స్‌పై ఆయన అవగాహన కల్పించారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

రెంటచింతల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రెంటచింతలలోని సినిమాహాల్ సెంటర్‌లో మంగళవారం జనసేన పార్టీ కార్యాలయాన్ని నియోజకవర్గ సమన్వయ కర్త బి.రామంజనేయులు టీడీపీ, బీజేపీ నేతలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే సైదావలి, వీరమహిళ మీరాబి, తాయ మహేష్, నరసింహారావు, మున్నా రాధ, శ్రీను, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి,సుమంత్‌రెడ్డి, బి.రామకృష్ణ, బీజేపీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బి.రామాంజనేయులు

స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

● పట్టణ సీఐ వెంకటరమణ

మాచర్ల రూరల్, 9 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ తురక వెంకటరమణ సూచించారు. మంగళవారం పట్టణంలోని పట్టణ పోలీస్‌స్టేషన్లో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సు డ్రైవర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఏఎస్‌ఐ ప్రభుదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

● పట్టణంలోని పలుచోట్ల చోరికి గురైన 10 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని సీఐ వెంకటరమణ తెలిపారు. వీటిని సెల్‌ఫోన్ల యజమానులకు అప్పగించామన్నారు.

గురజాలలో ఫుడ్ కమిషన్ సభ్యుడి ఆకస్మిక తనిఖీ

గురజాలటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. జంగమహేశ్వరపురంలో రేషన్ షాపును పరిశీలించారు. షాపులో 15 క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉండడంతో షాపును సీజ్ చేశారు. అలాగే అంగన్‌వాడీ, ప్రీప్రైమరీ స్కూల్, ఆదర్శ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం, వంటగది శుభ్రత, ఆహార ధాన్యాల నిల్వలను పరిశీలించారు. అనంతరం చర్లగుడిపాడు ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మండలంలోని గంగవరంలో కస్తూర్బా బాలికల విద్యాలయంలో బాలికలకు అందుతున్న ఆహారం, వసతులను పరిశీలించి భోజనం రుచి చూశారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

● మాచర్ల : పట్టణంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను పరిశీలించి స్టాక్‌ను లక్ష్మీరెడ్డి పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు నిర్దేశిత సమయంలో రేషన్ అందించాలన్నారు. అనంతరం కేసీపీ గెస్ట్ వద్దకు చేరుకున్న లక్ష్మీరెడ్డిని తహసీల్దార్ కిరణ్‌కుమార్ సన్మానించారు.


ఆహారాన్ని తనిఖీ చేస్తున్న లక్ష్మీరెడ్డి

సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన ఎస్ఈ వెంకటరత్నం

విజయపురిసౌత్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టును జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం మంగళవారం పరిశీలించారు. కుడి, ఎడమ కాలువల నుంచి విడుదలవుతున్న నీటి గురించి ఆరా తీశారు. సాగర్ జలాశయానికి వస్తున్న ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలపై అధికారులు ఎస్ఈ వెంకటరత్నంకు వివరించారు. కుడికాలువ 1.7 గేజ్ పాయింట్‌ను సందర్శించారు. అనంతరం మత్స్యకారుల సాగర్ క్యాంపు కాలనీలోని రూ.2.6 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రమేష్, డీఈలు మురళీధర్, శ్రీకాంత్, స్వరూపరాణి, జేఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

టెయిల్‌పాండ్‌లో కేఆర్ఎంబీ సందర్శన

రెంటచింతల: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టును కేఆర్ఎంబీ(కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు) సభ్యుడు ఎల్‌బి.ముందాంగ్ మంగళవారం సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా పవర్ హౌస్‌ను, మెయిన్ డ్యాం, క్రస్ట్‌గేట్లను పరిశీలించారు. కార్యక్రమంలో కేఆర్ఎంబీకి చెందిన డీఈ శ్రీనివాస్, ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు, జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

● ఫాదర్ గోవిందు బాలస్వామి

రెంటచింతల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో దూసుకుపోవాలని సెయింట్ జోసఫ్ హైస్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ గోవిందు బాలస్వామి అన్నారు. విజ్ఞాన్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో హైస్కూల్ స్థాయి బాల బాలికలకు రెండో రోజైన మంగళవారం వివిధ రకాల పోటీలను నిర్వహించారు. అండర్ 17 కబడ్డీ పోటీల్లో పిడుగురాళ్ల తిరుమల ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన బాలికలు ప్రథమస్థానం దక్కించుకోగా సిరిగిరిపాడు ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలకు చెందిన వారు రెండో బహుమతిని కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రమేష్ బాబు, పీడీలు కె.మోహనకృష్ణ, సురేష్, రవి, ఓరుగంటి వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం దుర్గా ప్రసాద్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.


బాలికల కబడ్డీ పోటీలో ప్రథమ బహుమతి సాధించిన తిరుమల ఆక్స్‌ఫర్డ్ స్టూడెంట్స్

కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలి

సత్తెనపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లిలో రెండు వందల సివిల్ కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించటానికి న్యాయవాదులు సహకరించాలని గుంటూరు జిల్లా రెండో అదనపు జిల్లా న్యాయాధికారి వై నాగరాజు కోరారు. ఈనెల 13వ తేదీన స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై మంగళవారం కోర్టు ఆవరణలో సమీక్ష న్యాయవాదులు, పోలీసులతో నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నగదుకు సంబంధించిన ఈపీలు పెద్దసంఖ్యలో పరిష్కారానికి సహకరించాలన్నారు. క్రిమినల్ కేసులు కూడా పరిష్కారమయ్యేలా నిందితులకు, ఫిర్యాదు దారులకు కౌన్సెలింగ్ నిర్వహించి సహకరించాలన్నారు. సమావేశంలో న్యాయాధికారులు సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు, జియా ఉద్దీన్, విజయ కుమార్‌రెడ్డి, తౌషిత్ హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటూరు అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

నకరికల్లు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలని నకరికల్లు జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి అంకిరెడ్డి శశికళ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆమె కండ్లకుంట సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. సచివాలయ పరిధిలో యాప్‌లలో నిర్వహిస్తున్న సర్వే ఎంత మేర పూర్తయింది?, ఎంత పెండింగ్ ఉంది? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. చాగల్లు, చీమలమర్రి సచివాలయాలను తనిఖీ నిర్వహించి సిబ్బందితో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులంతా సమయానికి కార్యాలయానికి వచ్చి ప్రజలకు వేగవంతంగా సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

అయ్యప్ప స్వామి సన్నిధిలో వైవీ దంపతులు


అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించిన వైవీ దంపతులు

సత్తెనపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయాన్ని మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు దంపతులు మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌ను వైవీ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజారులు ఆంజనేయులుకు స్వామి వారి శేషవస్త్రాన్ని, పూలదండను బహూకరించారు. కార్యక్రమంలో డోగిపర్తి సత్యనారాయణ, పుట్టి సాంబశివరావు, పెరుమాళ్ళ శంకర్, చౌట శ్రీనివాసరావు, జవ్వాజి రామ్మోహనరావు, మల్లవరపు చంద్ర శేఖర్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

జీవో నెం.36ను వెంటనే అమలు చేయాలి

● సహకార సంఘం ఉద్యోగుల డిమాండ్

మాచర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీవో నెం.36ను వెంటనే అమలు పరిచి 2019, 2024 సంవత్సరాల్లో పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేయాలని, అప్పటి వరకు మధ్యంతర భృతి ఇవ్వాలని సహకార సంఘం (జేఏసీ) ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో సహకార సంఘం బ్యాంకు మేనేజర్ కరుణాకర్‌బాబు, అసిస్టెంట్ మేనేజర్ కొండలు, నరసింహారావులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించే గ్రాట్యుటి సీలింగ్ 2 లక్షల కంటే పెంచాలని, గ్రాట్యూటి చట్టాన్ని అమలుచేసి.. చెల్లింపు చేయాలని తదితర డిమాండ్లను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు చెన్నయ్య, రామకృష్ణ, బ్రహ్మేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పడవ ప్రయాణంలో భద్రతా చర్యలు తీసుకోవాలి

అవరావతి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ధరణి కోట, దిడుగు గ్రామాల్లో కృష్ణానదిలో పడవ ప్రయాణం కోసం అనుమతి పొందిన బోట్ యజమానులు తప్పనిసరిగా భద్రతా చర్యలు పాటించి ప్రయాణికులను నది దాటించాలని తహసీల్దార్ దానియేలు, ఎంపీడీవో శివపార్వతి, ఎస్‌ఐ రాజశేఖర్ ఆదేశించారు. మంగళవారం రెండు గ్రామాల్లో కృష్ణానది వద్దకు వెళ్లి ప్రయాణికులకు ఉపయోగించే పడవలను పరిశీలించారు.


పడవ యజమానులతో మాట్లాడుతున్న అధికారులు

రైస్ మిల్లుల్లో తహసీల్దార్ తనిఖీలు

గురజాలటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం రోడ్డులో ఉన్న వెంకటరమణ, శ్రీనివాస్ రైస్ మిల్లులను మంగళవారం తహసీల్దార్ దుర్గేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు రైస్ మిల్లుల నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలన్నారు. రైతులు మిల్లులకు తీసుకొచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట ఏవో పుల్లారెడ్డి, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు ఉన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.9.66 కోట్ల నిధులు మంజూరు

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఆరు ప్రధాన రోడ్ల అభివృద్ధికి రూ.9.66 కోట్లు ఏపీఆర్ఆర్ఎస్‌పీ నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. నాలుగు మండలాల్లో గ్రామీణ రోడ్లను నూతన పరిజ్ఞానంతో అభివృద్ధి చేసేలా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. గ్రామీణ రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన కన్నా

పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం నరసరావుపేటలోని ఆమె కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమస్యలపై ఆమెతో మాట్లాడారు. అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు.


కృతికా శుక్లాతో మాట్లాడుతున్న కన్నాలక్ష్మీనారాయణ

పూలింగ్ గ్రామాల్లో రేపటి నుంచి రెవెన్యూ మేళా


రెవెన్యూ మేళాలో సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి

అమరావతి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి రెండో దఫా భూసమీకరణ జరిగే నాలుగు రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 11 నుంచి 17 వరకు రెవెన్యూ మేళా నిర్వహిస్తున్నారు. రెవెన్యూ మేళాలో భూసమస్యలు పరిష్కరించనున్నారు. దీనికి సంబంధించి 33 మంది గ్రామ రెవెన్యూ, సర్వేయర్లను ఇతర మండలాల నుంచి నియమించి వారితో సమస్యలు పరిష్కారం చేయనున్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి రైతులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దానియేలు, ఎంపీడీవో శివపార్వతి, డీపీవో చంద్రారెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ ఎస్ వెంకటేశ్వర్లు, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వో పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే ప్రవీణ్, పార్టీ శ్రేణులు


సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, టీడీపీ నాయకులు

క్రోసూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సోమవారం రాత్రి కలిశారు. సీఎంను కలిసిన వారిలో టీడీపీ క్రోసూరు మండల అధ్యక్షుడు మొగల్‌జాన్, మాజీ అధ్యక్షుడు గుడిపాడు బాషా, అచ్చంపేట మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పెదకూరపాడు మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్యలతో పాటు నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు కూడా ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కొమెరపూడి విద్యార్థులు

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమెరపూడి జడ్పీ హైస్కూల్లో చదువుతున్న ఎం ఆషారాణి, టీ సుధీర్‌లు జాతీయ స్థాయి అండర్- 19 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్‌ఎం విజయ మంగళవారం తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు బాపట్ల జిల్లా మోదుకూరులోని వేమన జడ్పీ హైస్కూల్లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్- 19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీరు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరపున పాల్గొని ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. 29 జనవరి 2026 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు మహారాష్ట్రంలోని నాగపూర్‌లో జరిగే అండర్- 19 సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీరు పాల్గొంటారని ఆమె తెలిపారు, ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సుబ్బారావు, ఎఫ్‌ఎంసీ ఛైర్మన్ జానీ బాషా, సంగం డెయిరీ పాలకేంద్రం ప్రెసిడెంట్ యర్ర వెంకటేశ్వరరావు, సుభానీ, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.


జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం విజయ

ఆట్యా, పాట్యా పోటీలకు నకరికల్లు హైస్కూల్ విద్యార్థులు


ఆట్యా, పాట్యా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్న విద్యార్థులతో హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడు

నకరికల్లు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ యూనివర్శిటీ చండీఘర్‌లో ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి జూనియర్ ఆట్యా పాట్యా చాంపియన్ షిప్ పోటీల్లో నకరికల్లు ఎస్‌వీవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొనున్నట్టు హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీల్లో యర్రంశెట్టి నిఖిల్, తిరుమలశెట్టి లిఖిత, చల్లా విజయ పాల్గొంటారని వివరించారు. జాతీయ స్థాయిలో పాల్గొనే క్రీడాకారులను ప్రధానోపాధ్యాయుడు జే శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు వీ ఝాన్సీరాణి, పీ రాజ, విద్యా కమిటీ ఛైర్మన్ కాసా మల్లికార్జునరావులు అభినందించారు.

మన సాగర్‌కి..

69 వసంతాలు

విజయపురిసౌత్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన జరిగి బుధవారంతో 69 వసంతాలు పూర్తి చేసుకుంది. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1955 డిసెంబరు 10వ తేదీన డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ రూపకల్పనకు ప్రముఖ ఇంజనీర్ కెఎల్ రావు, ముక్త్యాల జమీందార్ మహేశ్వరప్రసాద్‌ల ఆలోచనలు ఈ ప్రాజెక్ట్ రూపకల్పనకు మూలంగా చెప్పవచ్చు. ఈ ప్రాజెక్ట్ 1970లో నిర్మాణాన్ని పూర్తి చేసుకుంది. సాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు, ఇది 285 చ.కి.మీ. విస్తీర్ణం కలిగి 408 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని కలిగి ఉంది. గత 50 ఏళ్లుగా వచ్చిన వరదలకు రిజర్వాయర్‌లో పూడిక చేరడంతో సాగర్‌లో నీటి నిల్వ సామర్థ్యాన్ని 312 టీఎంసీలుగా ప్రభుత్వం నిర్ధారించింది. అంటే సుమారు 96 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని రిజర్వాయర్ కోల్పోయింది.

కుడి కాలువకు అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 1956 అక్టోబర్ 10న శంకుస్థాపన చేశారు. అనంతరం ఈ కాలువకు దివంగత ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న నీటిని విడుదల చేసి జాతికి అంకితమిచ్చారు. దీనిని జవహర్ కెనాల్ అని పిలుస్తారు. ఈ కాలువ గుంటూరు, ప్రకాశం జిల్లాలో సుమారు 203 కి.మీ. ప్రవహిస్తూ 11.74 లక్షల ఎకరాలుకు నీరందుతోంది.

సాగర్ ఎడమ కాలువకు లాలా బహదూర్ కెనాల్ అని నామకరణం చేశారు. ఈకాలువకు 1959లో అప్పటి రాష్ట్ర గవర్నర్ భీమ్‌సేన్ సచార్ శంకుస్థాపన జరుపగా కుడి కాలువతోపాటే ఇందిరాగాంధీ 1967 ఆగస్టు 4న ప్రారంభోత్సవం చేశారు. ఈ కాలువ ద్వారా 10.38 లక్షల ఎకరాలకు నీటిని అందిస్తోంది. కృష్ణా డెల్టా ప్రాంత రైతులకు పంటలు పండించేందుకు ఉపయోగకరంగా ఉంది.

సాగర్ ప్రాజెక్ట్‌పై నిర్మించిన 410 మెగావాట్ల ప్రధాన జల విద్యుత్ కేంద్రం, కుడి కాలువపై 90 మెగా వాట్ల జలవిద్యుత్ కేంద్రం, ఎడమ కాలువపై 60 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రాలను నిర్మించారు. వీటికితోడు కుడి కాలువపై హైడల్ పవర్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ రాష్ట్రంలో సాగు, తాగునీటితోపాటు విద్యుత్ కొరతను కూడా తీరుస్తోంది.



నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన నాటి చిత్రం (ఫైల్‌ఫొటో)



కోలాహలంగా.. యువజనోత్సవం





నేటితో ముగియనున్న ఉత్సవాలు

ఏఎన్‌యూ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిత్రలేఖనం. మట్టి బొమ్మల తయారీ, పౌరాణిక నాటకాలు, చిత్తు కాగితాలతో బొమ్మల తయారీ, ఏకపాత్రాభినయాలు, వంటి అంశాలతో నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న యువజనోత్సవం రెండో రోజు మంగళవారం ఆహూతులను ఆకట్టుకుంది. విద్యార్థులతో పాటు వారి సహచర విద్యార్థులు తమ చరవాణిల ద్వారా వివిధ ఫోజులుతో సెల్ఫీలు తీసుకుంటూ క్యాంపస్ ప్రాంగణమంతా ఆనందంతో కలియతిరిగారు. బుధవారంతో యువజనోత్సవం ముగియనుంది. పోటీల్లో భాగంగా నేడు థియేటర్ విభాగంలో స్కిట్, ఫైన్ ఆర్ట్స్ విభాగంలో రంగోలీ, కార్టూనింగ్, స్పాట్ ఫోటోగ్రఫీ పోటీలు జరగనున్నాయి. అనంతరం జరిగే ముగింపు సభలో మూడు రోజులు పాటు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అత్యంత కళా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తారు.



21 నుంచి.. మంగళగిరి ప్రీమియర్ లీగ్

- మంత్రి లోకేశ్ జన్మదినం సందర్భంగా క్రికెట్ టోర్నీ
- రూ.3 లక్షలు, రూ.2 లక్షలు, రూ.లక్ష బహుమతులు
- నమోదు చేసుకున్న 128 జట్లకు మొదటి రౌండ్ డ్రా

మంగళగిరి సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనవరి 23వ తేదీన రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యుడైన నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా నిర్వహిస్తున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం


ఎంపీఎల్-4 మొదటి రౌండ్ డ్రా తీస్తున్న నందం అబద్దయ్య, నేతలు

కానుంది. నెల రోజులపాటు జరగనున్న ఈ పోటీలకు మంగళగిరి పట్టణంలోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్) ఆతిథ్యం ఇవ్వనుంది. ఎంపీఎల్-4 క్రికెట్ టోర్నీలో తలపడేందుకు 128 జట్లు ఇప్పటికే తమ పేర్లు నమోదు చేసుకోగా, ఆయా జట్ల మధ్య పోటీలకు సంబంధించి మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో మంగళవారం సాయంత్రం మొదటి రౌండ్ డ్రా తీసి పోటీ పడనున్న జట్ల వివరాలను వెల్లడించారు. నియోజకవర్గంలోని క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మంత్రి నారా లోకేశ్ మంగళగిరి, తాడేపల్లి పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారని, గెలుపోటములతో సంబంధం లేకుండా స్నేహపూర్వక వాతావరణలో క్రీడాకారులు పాల్గొనాలని కోరారు.

పులుల గణనపై సర్వే

వెల్దుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయపురిసౌత్ రేంజ్ పరిధిలో గత ఎనిమిది రోజులుగా పులుల గణన జరుగుతోంది. వైల్డ్ లైఫ్ ఫారెస్ట్ రేంజర్ సుజాత ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి రేంజ్ పరిధిలో ఉన్న రెండు సెక్షన్లలోని 9 బీట్లలో ఈ గణన


పాదముద్రలు సేకరిస్తున్న అధికారులు

కొనసాగుతోంది. పులుల లెక్కింపుతో పాటు ఇతర మాంసాహార జంతువులను పాద ముద్రల ఆధారంగా గణన చేపట్టారు. ఈ గణనలో పెద్ద పులులతోపాటు చిరుత పులులు, రేసు కుక్కలు, ఎలుగుబంట్లు వంటి జాతుల లెక్కలు కూడా నిగ్గు తేల్చనున్నారు. అలాగే శాకాహార జంతువులు, గడ్డి జాతులు, చెట్ల గణన వంటి వాటిని కూడా ఈ లెక్కింపు ప్రక్రియలో భాగంగా చేపట్టనున్నారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ గణన తుది నివేదికలను అధికారులు త్వరలో వెల్లడించనున్నారు.

జోరుగా పేరేచర్ల-కొండమోడు హైవే పనులు

సత్తెనపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పేరేచర్ల-కొండమోడు హైవే అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మేడికొండూరు మండలం పేరేచర్ల నుంచి రాజుపాలెం మండలం కొండమోడు మధ్య జరుగుతున్న ఈ పనులకు రూ 881.61 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించటంతో కాంట్రాక్టు సంస్థ పనులు ప్రారంభించింది. ప్రస్తుతం రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయి. ఒక్కో వైపు 8.75 మీటర్లు రెండు వైపులా మార్జిన్‌లు కలిపి మొత్తం 22.5 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ పూర్తయితే అమరావతితో పాటుగా గుంటూరు, పల్నాడు ప్రాంత ప్రజలు హైదరాబాద్ వెళ్ళేందుకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయులు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హైవే అభివృద్ధి పనులు ప్రారంభించటానికి ఎంతగానో కృషి చేశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను ఇప్పటికే తొలగించారు. భారీ యంత్రాలతో రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ పరచి చదును చేస్తున్నారు. సత్తెనపల్లి, కొండమోడు వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు కూడా ప్రారంభించనున్నారు.


సత్తెనపల్లి - కొండమోడు మధ్య జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు

కరకట్ట ప్రమాదకరం

(5వ పేజీ తరువాయి)

పొడవున సింగిల్ రోడ్డుగా ఉండటంతో వాహనాలు తప్పుకునే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పెదకొండూరు-వల్లభాపురం మధ్య గతంలో 4 కిలోమీటర్ల పొడవున డబుల్ రోడ్డు వేసినా కిలోమీటరు వేయకుండా మాయచేశారు. అప్పటి నుంచి ఈ కొద్ది దూరం నరకప్రాయంగానే మారింది. వల్లభాపురం-హనుమాన్‌పాలెం మధ్య ఆధునికీకరించినా కట్ట దెబ్బతినిపోయింది. మున్నంగి పరిధిలో కరకట్ట పగుళ్లిచ్చి, సగం వరకు కుంగిపోయింది. హనుమాన్‌పాలెం నుంచి బాపట్ల జిల్లా కొల్లూరు మండలం ఈపూరు వరకు రోడ్డు పర్వాలేదన్నట్లున్నా, అక్కడి నుంచి కొల్లూరు వరకు నరకానికి రహదారిగా మారింది. కొల్లూరు-ఈపూరు,దోనేపూడి-వెల్లటూరుల మధ్య కిలోమీటరుపైగా విస్తరణకు నోచుకోలేదు. గతంలో వేసిన సింగిల్ రోడ్డు ఇరువైపులా నడుంలోతు వరకు కుంగిపోయింది. కార్లు రాకపోకలకు వీలు లేక పోగా లారీలు అదుపుతప్పుతున్నాయి.

ముగ్గురు మంత్రులూ దృష్టిపెట్టాలి..

మంగళగిరి, తెనాలి, రేపల్లె నియోజకవర్గాల పరిధిలోని కరకట్ట పటిష్టతపై మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌లు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. నదికి ఎడమ వైపున ఉన్న కరకట్ట ఆధునికీకరణకు రూ.138 కోట్లతో తాజాగా నీటిపారుదల శాఖ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. అయితే కుడి కరకట్ట ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లావైపు మాత్రం ఇప్పటి వరకు దృష్టి పెట్టలేదు. గత ఏడాది వరద సమయంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్‌లు రాత్రిళ్లు కూడా కరకట్టపైనే కాపలా ఉండి పటిష్ట పరిచారు. ఆ సమయంలో కరకట్ట పనులు చేపడతామని వారు హామీ ఇచ్చారు. అయితే వరదలు తగ్గాక దీనిపై పెద్దగా కదలిక కనిపించలేదు. గతంలో రూ.100 కోట్లతో చేసిన ప్రతిపాదనలు ప్రస్తుతం రెట్టిపయ్యే పరిస్థితి ఉంది. అయితే ముగ్గురు మంత్రులు దీనిపై దృష్టిపెట్టి కరకట్టను బలోపేతం చేయటంతోపాటు, గతంలో ఆధునికీకరణ సమయంలో వదిలేసిన ప్రాంతాల్లో వెడల్పుతో పాటు ఎత్తు పెంచి డబుల్ రోడ్డు వేస్తేనే ఈ మార్గంలో ప్రయాణం సురక్షితం అవుతుంది.


కొల్లిపర-వల్లభాపురం మధ్య కుంగి పగిలిపోయిన కరకట్ట రోడ్డు

ఎప్పుడో 1998లో రోడ్డేసి...

1998లో వచ్చిన వరదతో కరకట్టకు గండ్లు పడ్డాయి. దీంతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కరకట్ట ఎత్తు పెంచి, దానిపై తారుతో సిగిల్ రోడ్డు వేశారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు ఇదే రక్షణగా నిలిచింది. అయితే రోడ్డుపడ్డాక వాహనాల రద్దీ పెరిగింది. రూ.111 కోట్లతో 2010లో పనులు పూర్తి చేశారు. ప్రకాశం బ్యారేజి నుంచి పెనుమూడి వరకు కరకట్టను వెడల్పు చేసి, దానిపై డబుల్ రోడ్డు వేశారు. ఆ తర్వాత ఈ మార్గంలో రేపల్లె-విజయవాడ కరకట్ట బస్సు సర్వీసును కూడా ప్రారంభించారు. అయితే జగన్ ప్రభుత్వంలో కరకట్టపై ఇసుక రవాణాను అనుమతించారు. 40 నుంచి 50 టన్నులకుపైగా బరువుతో ఇసుక లారీలు విచ్చలవిడిగా తిరగడంతో రోడ్డు కుంగిపోయింది. నదివైపు అంచులు సగం వరకు కుంగి అత్యంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు పునర్ నిర్మాణం కోసం రూ.100 కోట్లతో నీటిపారుదల శాఖ పలు సార్లు ప్రతిపాదనలు పంపినా వైసీపీ ప్రభుత్వం వాటిని బుట్టదాఖలు చేసింది.

కొనుగోళ్లు కొంతే

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కళ్లాల్లోనే ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో వ్యవసాయ శాఖ, మార్కెటింగ్‌శాఖ అధికారులు నిర్లక్ష్య దోరణి.. మిల్లర్లు ఆడిందే ఆటగా పరిస్థితి నెలకొనడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. మద్దత దరకు ధాన్యం సేకరణ బాలారిష్టాల దశలో ఉండటంతో బహిరంగ మార్కెట్ కొనుగోళ్లను పట్టించుకునే వారే లేకుండా పోయారు. మొత్తం దిగుబడిలో ప్రభుత్వాలు సేకరించేది గరిష్ఠంగా 30 శాతానికే పరిమితం. మిగిలినదంతా కూడా బయట మిల్లుల్లోనో, దళారుల వద్దకు చేరేదే. అయితే లక్ష్యాల మేర కొనుగోళ్లపై పర్యవేక్షించాల్సిన అధికారులు వాటిని కూడా పట్టించుకోవడంలేదు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ మాత్రమే తమ పరిధిలోకి వస్తుందని, మిగతాదేదీ తమకు పట్టదన్నట్లు ఆయా విభాగాలు వ్యవహరిస్తున్నాయి. విభాగాల మధ్య సమన్వయం లేకపోగా ఒకరిపై ఒకరు సాకులు చెప్పుకుంటూ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో రైతులు అంతిమంగా నష్టపోవాల్సి వస్తోంది.

పర్యవేక్షణ పట్టదు..

మిల్లర్లు, దళారులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినా మద్దతు ధర ప్రామాణికం. అయితే మద్దతు ధరతో పనే లేదన్నట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితి ఉంది. ప్రభుత్వ కేంద్రాల ద్వారా మిల్లులకు తరలిన ధాన్యంపై ఏ అనే పేరుతో రిజిస్టర్ నిర్వహించాలి. ప్రైవేటుగా మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యానికి బీ అనే పేరుతో రిజిస్టర్ నిర్వహించాలి. ఏ రైతు నుంచి ఎంత ధరకు, ఎంత పరిమాణం కొనుగోలు చేశామనే సమగ్ర వివరాలు అందులో నమోదు చేయాలి. దీనిని డీఎస్‌వో సారథ్యంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ పర్యవేక్షించాలి. కానీ ఎక్కడా ఈ ప్రక్రియ కనిపించడంలేదు. ఏ గ్రామం పరిధిలో ఎంత పరిమాణం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లింది, ఎంతమేర బయటకు తరలివెళ్లింది అనే గణాంకాలను వీఏఏ కచ్చితంగా నమోదు చేయాలి. ఈ రికార్డూ లేదు. లక్షల టన్నుల ధాన్యం బయటి మార్కెట్‌కు తరలివెళుతుందని ఆయా విభాగాలకు తెలిసి కూడా, మామూళ్ల మత్తులో జోగుతూ తనిఖీలు మరిచారు. దళారులకు రైతులు అమ్ముకునే ధాన్యం వివరాలను వ్యవసాయ శాఖ సహకారంతో రెవెన్యూ రెగ్యులేట్ చేయాలి. ధాన్యం సేకరణలో తమకు సంబంధం లేదన్నట్లు రెవెన్యూ విభాగం వ్యవహరిస్తోంది. దీంతో ధాన్యం కొనుగోలు విషయంలో దళారులు ఆడింది ఆట, పాడిందిపాటగా కనిపిస్తోంది. మిల్లర్లు చెప్పిందే ధరగా చెలామణి అవుతుండడంతో అన్నదాతలు ఈ విషయమై వ్యవసాయశాఖను వివరణ కోరితే ఇది సివిల్ సప్లయిస్ విభాగం పరిధిలోనిదని చెప్పడం గమనార్హం. వ్యవస్థలన్నీ నిద్రావస్థలో ఉండడంతో బయటి మార్కెట్‌లో మరీ తీసికట్టుగా ధాన్యాన్ని రూ.1100 నుంచి రూ.1300కు కూడా అడుగుతూ రైతులను నిలువునా ముంచేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌కు ఇప్పటికే తరలివెళ్లిన లక్షన్నర టన్నుల ధాన్య విషయంలో ఇదే జరిగింది.

మిల్లర్లకే వత్తాసు

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు కొనుగోలు విషయంలో కొర్రీలతో సరిపెడుతున్నారు. రైతుకు షెడ్యూల్ ఇచ్చిన తర్వాత ట్రక్ షీట్, జీఎల్‌టీ, ఎఫ్‌టీవో జారీతో ప్రక్రియ ముగిసినట్లే. ఈ దశలో ఎక్కడా కూడా రైతుకు నేరుగా మిల్లర్‌తో సంబంధమే ఉండకూడదు. షెడ్యూల్ ఇచ్చేటప్పుడు మాత్రం మిల్లు ఎంపిక మాత్రం రైతు ఇష్టాన్ని బట్టి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో మిల్లర్లు ధాన్యానికి కొర్రీలు పెడుతూనే ఉన్నారు. ఆర్‌ఎస్‌కే సిబ్బంది మిల్లర్లతో కలిసి మాయాజాలానికి తెరలేపడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఓసారి తేమ విషయంలో ఆర్‌ఎస్‌కేలో ఫైనలైజ్ అయిన తర్వాత మళ్లీ మిల్లు దగ్గర దాని విషయంలో కిరికిరి పెట్టడం వెనక మతలబు ఇదే. వాటిని పరిష్కరించాల్సిన ఆర్‌ఎస్‌కే టెక్నికల్ అసిస్టెంట్, మిల్లు కస్టోడియన్ అధికారులు మిల్లర్లకే వత్తాసు పలుకుతున్నారు.

షిర్డీ రెగ్యులర్ వీక్లీ ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు కూత

గుంటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుపతి - సాయినగర్ షిర్డి రెగ్యులర్ వీక్లీ ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు గుంటూరు రైల్వేస్టేషన్‌లో కూత పెట్టింది. ఈ రైలుని మంగళవారం ఉదయం 11.10 గంటలకు న్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో రైల్వే సహాయ మంత్రి సోమన్న పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి మీదగా సాయంత్రం 6.09 గంటలకు గుంటూరుకు చేరుకొని 6.45కి బయలుదేరి వెళ్లింది. బుధవారం మధ్యాహ్నం 2.45కి నాగర్‌సోల్, సాయంత్రం 6.35కి సాయినగర్ షిర్డి చేరుకొంటుందని రైల్వేవర్గాలు తెలిపాయి. కాగా రెగ్యులర్ వీక్లీ రైలు మాత్రం ఈ నెల 14వ తేదీ నుంచి ప్రతీ ఆదివారం వేకువజామున 4 గంటలకు తిరుపతిలో బయలుదేరి ఉదయం 8.48కి చీరాల, 9.53కి తెనాలి, 10.40కి గుంటూరుకు చేరుకొని సాయినగర్ షిర్డికి బయలుదేరుతుంది. కాగా ఆదివారం మధ్యాహ్నం నరసపూర్ - నాగర్‌సోల్ బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ కూడా ఉంది. ఈ నేపథ్యంలో ఒకే రోజున


తిరుపతి - సాయినగర్ షిర్డీ రెగ్యులర్ వీక్లీ ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు

రెండు రెగ్యులర్ రైళ్ల షిర్డికి ఏర్పాటు చేయడం ప్రయాణీకులకు అంతగా ఉపయోగం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో బుధవారం ఇక్కడి నుంచి బయలుదేరి గురువారం షిర్డికి చేరుకొనేటట్లు అయితే ప్రయాణీకుల ఆదరణ బాగా ఉంటుందని చెబుతున్నారు.

చోర్ గ్యాంగ్ లీడర్ తండ్రి ఏఎస్‌ఐ బదిలీ

ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి కేసులో కదలిక

నరసరావుపేట లీగల్, చిలకలూరిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట బైపాస్‌లో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతికి కారణమైన చోర్ గ్యాంగ్ లీడర్, నకిలీ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ మదమంచి వెంకటనాయుడు తండ్రి ఏఎస్‌ఐ మదమంచి శ్రీనివాసరావుపై ఎట్టకేలకు వేటు పడింది. నరసరావుపేటపేట డీఎస్పీ కార్యాలయంలో ఏఎస్‌ఐగా ఉన్న శ్రీనివాసరావుపై గతంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అయితే పలుకుబడి, హై ప్రొఫైల్, రాజకీయ అండదండలతో 15 ఏళ్లుగా నరసరావుపేట పోలీస్ సబ్ డివిజన్లోనే వివిధ హోదాల్లో బాధ్యతలు ఆయన నిర్వహించాడు. కాగా ఈ నెల 4న జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఏఎస్‌ఐ కుమారుడు ప్రధాన నిందితుడిగా ఉన్నతాధికారులు నిర్ధారించారు. ఈ క్రమంలో డీఐజీ, ఎస్పీ జోక్యంతో ఎట్టకేలకు శ్రీనివాసరావును గురజాల సబ్ డివిజన్‌లోని వెల్దుర్తికి బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దర్యాప్తును పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు

చిలకలూరిపేట బైపాస్ రోడ్డులో ఇంజనీరింగ్ విద్యార్థుల మృతికి సంబంధించిన కేసు దర్యాప్తును ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. నరసరావుపేటకు చెందిన ఐదుగురు సభ్యుల చోర్ గ్యాంగ్ వాడిన కార్లు, గతంలో చేసిన నేరాలు, సహకరించిన వారు ఎవరు, ఎంత కాలంగా వీరు నేరాలు చేస్తున్నది తదితర వివరాలను సేకరిస్తున్నారు. నరసరావుపేట ఇన్‌చార్జి డీఎస్పీ ఎం హనుమంతరావు చిలకలూరిపేటలోనే మకాం చేసి నిందితులను విచారిస్తున్నారు. కుమారుడు చేసిన నేరాల్లో ఏఎస్‌ఐగా ఉన్న తండ్రి పాత్ర ఎంత మేరకు ఉన్నదన్న విషయంతో పాటు ఆయనకు శాఖలో ఇంకా ఎవరైనా తోడ్పడ్డారా అనే విషయంపై కూపీ లాగుతున్నారు.

పాఠశాలల్లో.. అంగన్‌వాడీ కేంద్రాలు

- పైలెట్ ప్రాజెక్టుగా క్రోసూరు మండలం



సత్తెనపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆరు నుంచి 14 సంవత్సరాలలోపు ఉన్న చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను ఒకే దగ్గర అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలను సమీప ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించేందుకు కో లొకేషన్ ప్రోగ్రాంకు శ్రీకారం చుట్టాయి. అందులో భాగంగా పల్నాడు జిల్లాలో క్రోసూరు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు.

ఐదు వందల మీటర్ల దూరం లోపు

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని ఎంపిక చేశారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ సంయుక్తంగా పని చేస్తాయి. పిల్లలకు పౌష్టికాహారం అందించటంతో పాటు ప్రాథమిక విద్యకు దూరంగా కాకుండా సేవలను బలోపేతం చేయటం ప్రాజెక్టు ఉద్దేశం. ఇందులో భాగంగా అంగన్ వాడీ కేంద్రాలను రెండు వందల నుంచి ఐదు మీటర్ల దూరంలో ఉన్న పాఠశాలల్లో కలిపి నిర్వహిస్తారు. క్రోసూరు మండలంలో 59 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. కేంద్రాలు పాఠశాలల్లో మౌళిక వసతులు, భవన స్థితిగతులను పరిశీలించేందుకు మండల స్థాయిలో కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఎంఈవో, కో చైర్మన్‌గా సీడీపీవో, సభ్యులుగా అంగన్ వాడీ పర్యవేక్షకులు, ఇతర సభ్యులు ఉంటారు.

ఏమి గుర్తిస్తారంటే...

పాఠశాలల్లో తరగతి గదులు, మరుగు దొడ్లు, తాగు నీటి సౌకర్యం, వంట గది, ఆట స్థలాలు, స్టోర్ రూమ్, ప్రవేశ ద్వారాలు, ప్రహరీ తదితర అంశాలను పరిశీలిస్తారు. మ్యాపింగ్ చేసి నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపిస్తారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహద పడేలా ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా క్రోసూరు మండలాన్ని ఎంపిక చేసిందని ఐసీడీఎస్ పల్నాడు జిల్లా పీడీ ఉమాదేవి తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్ వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించేందుకు విద్యా శాఖ అధికారులతో చర్చించాల్సి ఉందని తెలిపారు.

పాఠశాల ఆవరణలో ముళ్లచెట్ల తొలగింపు

బొల్లాపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సహకారంతో మంగళవారం బండ్లమోటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో ముళ్ళచెట్లను తొలగించారు. ముళ్లచెట్ల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటుండటంపై టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్ళటంతో తక్షణ చర్యలకు జీవీ సాయం చేశారు. కంప తొలగింపులో పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్థులు సహకరించారు. ఎస్ఐ సమీర్ బాషా, మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశిం సాహెబ్, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

క్లుప్తంగా...

● నరసరావుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కోడెల శివప్రసాద రావు చారిటబుల్ ట్రస్ట్, శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో ఈ నెల 13న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని మందాడి రవి మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు రాజాగారి కోట డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు ఆసుపత్రి సముదాయంలో ప్రారంభం అవుతుందన్నారు.

● నాదెండ్ల: మొక్క జొన్న పైరుపై అధిక మోతాదులో గడ్డి మందు వాడటంవల్ల మొక్క పెరుగుదలలో సమస్యలు వస్తాయని నరసరావుపేట ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. సాతులూరు గ్రామంలో ఆత్మవారి సౌజన్యంతో మొక్క జొన్న రైతులకు మంగళ వారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

● బొల్లాపల్లి: మండలంలోని చక్రాయ పాలెంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటరావు మంగళవారం మిర్చి పంటలను పరిశీలించారు. మిరపలో తెగుళ్ళు, చీడ పీడల నివారణపై పలు సూచనలు చేశారు.

● నరసరావుపేట టౌన్: ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థులు నరసరావుపేట పట్టణం, పెట్లూరివారిపాలెంలో మంగళవారం స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతిశ్రీనివాసరెడ్డి ప్రారంభించారు.

● నరసరావుపేట టౌన్: ఎంఏఎం లా కళాశాల విద్యార్థి రామావత్ అనిల్ బ్లాక్ బెల్ట్ కేటగిరిలో జాతీయస్థాయిలో ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల వీర బ్రహ్మం మంగళవారం తెలిపారు.

● నరసరావుపేట టౌన్: గుంటూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబరు 8న బీఆర్ స్టేడియంలో జరిగిన క్రాస్ కంట్రీ పోటీలలో వాగ్దేవి జూనియర్ కళాశాలల విద్యార్థులు ఐదుగురు ప్రతిభచాటారని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఎంఏఎం కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఎంఏఎం విద్యాసంస్థల అధినేత మేదరమెట్ల రామశేషగిరిరావు యువ జనోత్సవ పోటీలకు అధ్యక్షత వహించారు.

● నరసరావుపేట రూరల్: స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో ఐఐటీ-ఐఐఎం ప్రముఖుల నేతృత్వంలోని దేశీయ డీప్ టెక్ సంస్థ వెక్సెల్ సహకారంతో అత్యాధునిక ఏఐ సెంటను ఘనంగా ప్రారంభించినట్లు కళాశాల వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

● నరసరావుపేట రూరల్: కృష్ణవేణి డిగ్రీ కాలేజీలో డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ విద్యార్థుల కోసం 'రోడ్ మ్యాప్ టు లెర్న్ డేటా సైన్స్' అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకట్ ఇక్కుర్తి పాల్గొన్నారు.

● వినుకొండ టౌన్: వినుకొండ రైల్వే స్టేషన్‌లో శ్రీగుంటి ఆంజనేయ స్వామి వారి చిత్రాన్ని ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యురాలు కొంకా రాధ, దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజనల్ అధికారి సుదేష్ణకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. డీఆర్ఎం సానుకూలంగా స్పందించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

● శావల్యాపురం: ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో శావల్యాపురం ప్రాథమిక పాఠశాల్లో నూతన కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్టీయూ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, ఉపాధ్యాయుల సమస్యలు, వాటి పరిష్కరించే మార్గలపై సమావేశంలో చర్చించారు.

● ఈపూరు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు మంగళవారం మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రొంపిచర్ల మండలం ఆరేపల్లి, విప్పర్లరెడ్డిపాలెం, ఈపూరు మండలం ముప్పాళ్ళలోని మద్యం దుకాణాల్లో సీఐ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని లింగంగుంట్ల శంకరభారతీపురం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభచూపారు. జాన్‌పాల్ రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానం, శ్రీకాంత్ సిల్వర్ మెడల్, రాజ్‌కమల్ సిల్వర్ మెడల్ సాధించినట్లు హెచ్ఎం పార్వతి తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించండి

● గ్రామాల్లో శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలి ● పోలీసులతో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలని చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు వినుకొండ పట్టణ, గ్రామీణ పోలీస్ స్టేషన్ల సీఐలు ప్రభాకర్, బ్రహ్మయ్యతో ప్రభుత్వ చీఫ్‌విప్ కార్యాలయంలో మంగళవారం జీవీ ఆంజనేయులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక శక్తుల్ని ఉపేక్షించవద్దని, గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. నేరప్రవృత్తి గల వారి కదలికలు ముందుగానే గుర్తించి చర్యలు చేపట్టాన్నారు. మరీ ముఖ్యంగా మహిళల భద్రత విషయంలో వచ్చే ఫిర్యాదులను వేగంగా స్పందించాలని దిశా నిర్దేశం చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గ్రామాల్లో చిన్న చిన్న గొడవలు, వాగ్వాదాలు పెద్ద సమస్యలకు దారితీయకుండా ముందే జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

రామలింగేశ్వరస్వామి గుడి, ఘాట్ రోడ్డుకు నిధులు మంజూరు

వినుకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సిఫార్సుతో వినుకొండ కొండపై ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 4కోట్లు సీజీఎఫ్ నిధులు కేటాయిస్తూ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో దేవాలయ నిర్మాణానికి రూ.2కోట్లు నిధులు ప్రభుత్వం కేటాయించగా, ఆలయ నిర్మాణానికి ఖర్చు అంచనా పెరగడంతో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు గుడి నిర్మాణానికి పెరిగిన అంచనాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. సీఎం ఆదేశాలతో రామలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి 4కోట్లు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. దీనిపై వినుకొండ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా ఘాట్‌రోడ్డు నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించనున్నారు.

కొనుగోలు చేయలేకపోతే సీసీఐ కేంద్రాలను మూసేయండి

● ఎమ్మెల్యే ఎదుట బయ్యర్‌పై రైతుల ఆగ్రహం

నాదెండ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న రైతుల పత్తిని సీసీఐ వారు కొనుగోలు చేయలేనప్పుడు ఆ కేంద్రాలను మూసి వేసుకోవాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గణపవరం గ్రామంలోని వెంకట కృష్ణ ఎంటర్ ప్రైజస్‌లో ఉన్న పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై రైతులు ఆయన ఎదుట గళం విప్పారు. తుఫాన్ వల్ల ఎకరాకు నాలుగైదు క్వింటాళ్ళ కన్నా దిగుబడి వచ్చే పరిస్థితి కన్పించటం లేదని, ఆ పత్తిని సీసీఐకి తీసుకు వస్తే ఏవో వంకతో తిరస్కరిస్తున్నారని ఆరోపించారు. స్లాట్ బుక్ చేసుకొని పత్తిని తీసుకువస్తే తేమశాతం ఉందనో, గుడ్డికాయ ఉందనో తిరస్కరిస్తున్నారని వాపోయారు. క్వింటాకు రూ.500లకు పైగా ఖర్చవుతుందని, తిరస్కరిస్తే ఆ పత్తిని ఎక్కడ అమ్ముకోవాలంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తిలో నాణ్యత లేక పోతే ధర తగ్గించైనా కొనుగోలు చేయాలి కాని తిరస్కరించటం సరికాదన్నారు. స్థానికంగా ఉన్న రైతుల నుంచి పత్తి కొనకుండా బయటనుంచి దళారులు తెచ్చే పత్తిని కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.


సీసీఐ కేంద్రంలో ఎమ్మెల్యే పుల్లారావుకు పత్తిని చూపుతున్న రైతు

సీఎం దృష్టికి తీసుకువెళతా: ఎమ్మెల్యే పుల్లారావు

ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ సమస్య తీవ్రతను సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చంనాయుడు దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. రైతుల్లో సీసీఐ కొనుగోలుపై తీవ్ర అసంతృప్తి ఉందని, కష్టపడి రైతులు తీసుకువచ్చిన పంటను నిబంధనల పేరిట వెనక్కి పంపటం న్యాయం కాదన్నారు. ఆయన వెంట మార్కెట్ యార్డు చైర్మన్ కరిముల్లా, మునిసిపల్ చైర్మన్ రఫానీ, నాయకులు తేళ్ళ సుబ్బారావు, తోట రాజారమేష్, ఎం వీరారెడ్డి, సోంబాబు, నాగపూర్ణచంద్ర రావు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు అన్నదానం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం ప్రారంభించారు. నాగసరపు రామారావు, నాగసరపు సుబ్బరత్నంల జ్ఞాపకార్థం మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, ఆయన కుమారులు రూపేష్ గుప్తా, రామ్‌దేవ్ గుప్తాలు ఈ అన్నదానంను ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమం ప్రతి నెల 9వ తేదీన గర్భిణుల కోసం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రంగిశెట్టి రామకృష్ణ, వనమా సాంబశివరావు, గట్టుపల్లి సత్యనారాయణ, పచ్చిపులుసు సతీష్, ఆదిరెడ్డి, చేగు వెంకటేశ్వరరావు, చీతిరాల గురుపెద్దన్న, పెరుమాళ్ళ సత్యనారాయణ, తాళంకి శివ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. 350మంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవిందబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ సుబ్బరాయగుప్తా తదితరులు

మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు సరికాదు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై మతిస్థిమితం లేని ఆరోపణలు సరికాదని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. 104, 108 అంబులెన్స్‌లలో కేసులు తెచ్చుకొని ఆపరేషన్‌లు చేసే దౌర్భాగ్యపు మనసు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిదన్నారు. శ్రీనివాసరెడ్డి ఓ కాలనీని దత్తత తీసుకొని శుభ్రం చేయాలన్నారు. నా ప్రాణాలు అర్పించైనా లింగంగుంట్ల భూములను దగ్గరుండి రిజిస్ట్రేషన్ చేసి వాళ్ళకు అందిస్తా అన్నారు.

చలో ఢిల్లీ జయప్రదం చేయండి

నరసరావుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధనకై ఈ నెల 15న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు అన్నారు. మంగళవారం నరసరావుపేటలో ఈ నెల 15, 16 తేదీలలో ఓబీసీ చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త తదితరులు పాల్గొన్నారు.

పోట్లూరు సర్పంచ్ ఫిర్యాదుపై డీఎల్‌పీవో విచారణ

పోట్లూరు (శావల్యాపురం) డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తనకు తెలియకుండా కార్యదర్శి పంచాయతీ ఖాతాలోని నిధులు చేసినట్లు శావల్యాపురం మండలం పోట్లూరు సర్పంచ్ పోపూరి జ్యోతి పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు డీఎల్‌పీవో లక్ష్మణరావు పోట్లూరు గ్రామ సచివాలయంలో మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామపంచాయతీ రికార్డులు, పంచాయతీ తీర్మాణాలు, బ్యాంక్ లావాదేవీలు తదితర అంశాలను పరిశీలించారు.రు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి వారి వివరణ తీసుకొన్నారు.

ఫ్లోర్ బాల్ పోటీల్లో డీపీఎస్ విద్యార్థులకు మూడో స్థానం

నరసరావుపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ఈ నెల 6, 7తేదీలలో రాష్ట్ర స్థాయి 19వ ఫ్లోర్‌బాల్ బాల బాలికల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో బాలుర విభాగంలో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పల్నాడు జిల్లా కడప జిల్లాపై రెండు సున్నా తేడాతో గెలిచి మూడో స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్‌లో అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు, డైరెక్టర్ నాగోతు సబిత విద్యార్థులను అభినందించారు.

నేటి ర్యాలీని విజయవంతం చేయండి: మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నేడు జరగనున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేక ర్యాలీని విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా వైసీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. 62,500 సంతకాలను నరసరావుపేట నియోజకవర్గంలో సేకరించినట్లు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచే పోటీ చేస్తా: మాజీ మంత్రి రజిని

చిలకలూరిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికలలో చిలకలూరిపేట నుంచే పోటీ చేస్తానని మాజీ మంత్రి రజిని మంగళవారం వెల్లడించారు. చిలకలూరిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో మొత్తం 64,511 సంతకాలు సేకరించినట్టు తెలిపారు. సేకరించిన సంతకాలను త్వరలో పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమర్పించనున్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు సంసిద్ విద్యార్థులు

కనమర్లపూడి (శావల్యాపురం) డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో సంసిద్ విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సాగర్‌బాబు మంగళవారం తెలిపారు. విద్యార్థులను, పీడీ నాగరాజును ప్రిన్సిపాల్ అభినందించారు.

సచివాలయాల్లో డిప్యూటీ ఎంపీడీవో తనిఖీ

బొల్లాపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు, నాయుడుపాలెం గ్రామాల్లో డిప్యూటీ ఎంపీడీవో సచివాలయాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సర్వేలను వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.

30 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గం పరిధిలోని 30మందికి రూ.16లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఇక్కడ పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురు రోడ్లు, డ్రైనేజ్‌లనిర్మాణం, పింఛన్లకు సంబంధించిన అర్జీలు ఇచ్చారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

చెంచు పున్నయ్యకు ప్రశంస

తన సతీమణి రామ తులశమ్మ జ్ఞాపకార్థం అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.లక్ష విరాళమిచ్చిన దాత, పట్టణ ప్రముఖులు బొగ్గవరపు చెంచు పున్నయ్యను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశంసించారు. చెంచు పున్నయ్య అందించిన రూ.లక్ష చెక్కును సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన సందర్భంగా అందించినట్టు ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు.

13న జరిగే జాతీయ అదాలత్‌పై సమీక్ష

నరసరావుపేట లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ నెల 13న స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై మంగళవారం సమీక్ష నిర్వహించారు. న్యాయాధికారులు న్యాయవాదులు, పోలీసులతో ఈ సమీక్ష నిర్వహించారు. గుంటూరు జిల్లా రెండో అదనపు జిల్లా న్యాయ అధికారి వై.నాగరాజా మాట్లాడుతూ నరసరావుపేటలో సివిల్ కేసులు సుమారు 200 రాజీమార్గం ద్వారా పరిష్కరించడానికి న్యాయవాదులు సహకరించాలన్నారు. సమావేశంలో మూడో అదనపు జిల్లా న్యాయ అధికారి సీహెచ్‌వీఎన్ శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జియావుద్దీన్, స్థానిక న్యాయాధికారులు సబ్‌డివిజన్‌లోని ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న న్యాయాధికారి నాగరాజా

తిరుమల ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

నరసరావుపేట రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న తాటి జగదీష్‌కు ఐఐటీ బాంబే క్విప్ విభాగం నుంచి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూర్కెలా డాక్టరేట్ పట్టాను అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తాటి జగదీష్‌ను అభినందించారు.


పట్టాను చూపుతున్న జగదీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ

జీవీపై ఆరోపణలు తగదు: టీడీపీ నాయకులు

వినుకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జీవీ ఆంజనేయులుపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని వినుకొండ పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మిలట్రీ వెంకట్రావు, వాసిరెడ్డి హనుమంతరావు, బోలేపల్లి వెంకట్రావు, బీదెళ్ల గోవిందరాజులు, గంగినేని చంద్రశేఖరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినుకొండలో బొల్లా బ్రహ్మనాయుడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూదందా చేశారన్నారు. భూ సమస్యలను పరిష్కరించమని వెళ్లినవారిని బెదిరించి కారుచౌకగా భూమిని కొని, పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించి దానిని ప్రభుత్వానికి అమ్మారని ఆరోపించారు.